క్లుప్తంగా

నీటి ఎద్దడి నివారణకు చర్యలు


వీధి కుళాయిలను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మొయినుద్దీన్

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని చెట్నహళ్లి గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తడంతో గ్రామస్తులు సోమవారం ప్రజా వేదికలో అర్జీలు సమర్పించారు. మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు డీఈ మొయినుద్దీన్, మండల అధికారులు ఎంపీడీఓ నూర్జహాన్ ఆధ్వర్యంలో గ్రామంలో సందర్శించి ఎస్సీ, బీసీ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించారు. వీధి కుళాయిలకు నీటిని సరఫరా చేయించారు. అలాగే మురుగు కాలువలు, నీటి కుంటలు, డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి పాముకాటు


పాముకాటుకు గురైన బజారిని పరామర్శిస్తున్న ఎంపీడీఓ పుల్లయ్య

నందవరం : మండల పరిధిలోని ముగతి గ్రామంలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న ఒక కూలీ పాముకాటుకు గురయ్యాడు. మంగళవారం ఉదయం గ్రామంలో ఉపాధి పనులు నిర్వహిస్తుండగా బజారి కాలుకు పాము కరిచింది. పక్కన ఉన్న కూలీలు గమనించి బైక్‌పై బజారిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి వైద్య సేవలు అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ పుల్లయ్య ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని బజారిని పరామర్శించారు. ఏపీఓ శ్రీనివాసులు ఉన్నారు.

దోమల మందు పిచికారీ


కస్తూర్బా విద్యాలయంలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్స్‌లో మంగళవారం దోమల మందును పిచికారీ చేయించినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. ఆయన మాట్లాడుతూ జూన్ నెలలో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. హాస్టల్‌లో చదివే విద్యార్థులు దోమకాటుకు గురికాకుండా ముందు జాగ్రత్తగా దోమల మందును పిచికారీ చేయిన్నట్లు తెలిపారు. అలాగే గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ఇంటి పరిసరాలలో నీటి నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ హనుమంతు, ఎంపీహెచ్ఎస్ పరమేశప్ప తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, ఇందులో భాగంగా సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు టీచర్ నాగన్న, ఏనుగుబాల సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయం ఆవరణలో రాయలసీమ ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు సిద్ధేశ్వరం అలుగు.. సీమకు వెలుగు పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మే 31న సిద్ధేశ్వరం అలుగు ప్రజా సంకుస్థాపన 9వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రాయలసీమకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కాశీవిశ్వనాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, స్వామిదాసు, నరసప్ప, బతకన్న, అమ్రేష్ తదితరులు పాల్గొన్నారు.

కాటికాపరి ఈరన్న కుటుంబాన్ని ఆదుకోండి

కౌతాళం: శ్మశానంలో కాటికాపరి వృత్తి నిర్వహించే కాటికాపరి చిన్న ఈరన్న కుటుంబాన్ని ఆదుకోవాలని కాటికాపరుల సంఘం రాష్ట్ర నాయకుడు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో అనారోగ్యంతో మరణించిన కాటికాపరి చిన్నిఈరన్న మృతదేహంపై ఆనంద్ బాబు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, జిల్లా నాయకులు విజయ్, వీరేష్, తాయప్పలతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దుర్భరమైన జీవితాలు గడుపుతున్న కాటికాపర్లందరిని నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండు చేశారు.

సర్దుబాటు.. ఉపాధ్యాయులకు తలపోటు

- పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ అంతా గందరగోళం
- ప్రభుత్వ పాఠశాలలు 9 రకాల విభజన
- నియోజకవర్గంలో 80కుపైగా ఉపాధ్యాయులు సర్‌ప్లస్
- డీఎస్సీలో చూపిన పోస్టుల కంటే మిగులు ఉపాధ్యాయులే ఎక్కువ

ఆదోని సెంట్రల్: పాఠశాలల్లో పునర్ వ్యవస్థీకరణ అంతా గందరగోళంగా ఉంది. పాఠశాలలు సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయుల పోస్టులకు ఎసరు పెడుతున్నట్లు కనిపిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా డీఎస్సీలో ఖాళీలను చూపిస్తూ వాటిని భర్తీ చేస్తున్నట్లు నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే పునర్ వ్యవస్థీకరణలో భాగంగా డీఎస్సీలో చూపించిన ఖాళీ పోస్టుల కన్నా మిగులు ఉపాధ్యాయులే ఎక్కువగా ఉన్నారని తేల్చారు. దీంతో సర్‌ప్లస్‌లో ఉన్న ఉపాధ్యాయులను ఎక్కడ సర్దుబాటు చేస్తారో, డీఎస్సీ పోస్టులను ఎలా భర్తీ చేస్తారో అంతా అయోమయంగా ఉందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

నిబంధనలు పక్కనబెట్టి సర్దుబాటు

కూటమి నాయకులు మేము అధికారంలోకి వస్తే జీఓ నంబర్.117ను రద్దు చేస్తామన్నారు. అయితే జీఓ రద్దు చేయక పోగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ పేరుతో ఉపాధ్యాయులను గందరగోళంలోనికి నెట్టింది. విద్యాహక్కు చట్టం ప్రకారం మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులు ఉండాలి. కూటమి ప్రభుత్వం ఆ నిబంధనలను పక్కన పెట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తోంది. నియోజవర్గంలో 130 ప్రభుత్వ పాఠశాలలు, 30వేల మంది విద్యార్థులు, 800 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. కాగా, సర్దుబాటు పోనూ నియోజకవర్గంలో 80కిపైగా ఉపాధ్యాయులు సర్‌ప్లస్‌లో (మిగులు) ఉన్నట్లు తెలుస్తోంది. ఒక నియోజకవర్గంలోనే ఇంతమంది మిగులు ఉపాధ్యాయులు ఉంటే జిల్లాలో ఎంత మంది ఉంటారో. ఎన్ని పోస్టులు ఖాళీ ఉంటాయో అనే సందేహాలను ఉపాధ్యాయ సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. ఉపాధ్యాయులతో సంబంధం లేకుండా అధికారులు ఈ ప్రక్రియ చేపట్టడంతో అంతా గందరగోళంగా మారింది. ఏ పాఠశాలను ఏ విధంగా విభజించారో, ఆ పాఠశాల క్యాడర్, పోస్టుల వివరాలు కూడా ఎవరికి తెలియడం లేదు. అంతా గోప్యంగా ఉంచి పోస్టులను తగ్గించే ప్రక్రియ చేపట్టారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాలల విభజన ఇలా..

ప్రభుత్వ పాఠశాలలను కూటమి ప్రభుత్వం 9 రకాలుగా విభజించింది. ఎల్‌కేజీ, యుకేజీ చదువుతున్న పిల్లలకు శాటిలైట్ పాఠశాలలు, 1,2 తరగతులు ఫౌండేషన్ పాఠశాలలు, 1,2 తరగతుల్లో ఎన్‌రోల్ మెంట్ 45 మంది కంటే ఎక్కువగా ఉండే పాఠశాలలు 1 నుంచి 5వ తరగతి వరకు బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మర్చనున్నారు. ఇందులో 1 నుంచి 5వ తరగతి వరకు కొన్ని మోడల్ ప్రాథమిక పాఠశాలలు, 1 నుంచి 8వ తరగతి వరకు అప్పర్ ప్రైమరీ పాఠశాలలుగా చేయనున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఉన్నత పాఠశాలలు, 1 నుంచి 10వ తరగతి వరకు ఉన్నత పాఠశాలలు, 6 నుంచి 12వ తరగతి వరకు ఉన్నత పాఠశాలల ప్లస్‌గా, 1 నుంచి 12వ తరగతి వరకు ఉన్నత పాఠశాలల ప్లస్‌గా చేయనున్నారు.

ప్రైమరీ పాఠశాలగా ఎంపీయూపీ స్కూల్..

ఆదోని మండలం పెలబండ గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల ఉంది. 1 నుంచి 7వ తరగతి వరకు 120 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే ఇక్కడ ఎడు తరగతులకు గాను ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం అనుసరిస్తున్న 9 రకాల బడుల విధానం వలన ఎంపీయూపీ పాఠశాల ప్రాథమిక పాఠశాలగా మారనుంది. ఇక్కడ చదువుతున్న 6,7 తరగతుల విద్యార్థులను పెసలబండ గ్రామ సమీపంలో ఉన్న కపటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి.

అంతా గందరగోళంగా ఉంది



కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ఉపాధ్యాయుల్లో గందరగోళం నెలకొంది. ఏ పాఠశాల ఏ విధగా విభజించారో, ఏ పోస్టు ఏ క్యాడర్‌లోకి వెళుతుందో తెలియని పరిస్థితి. జీఓ నంబర్. 117ను రద్దు చేస్తామని చెప్పి.. ఇప్పుడు రద్దు చేయకుండా 3 నుంచి 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం సరికాదు. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణను బహిర్గతం చేయాలి. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి పోస్టులను కేటాయిస్తే మంచిది.

– గాదిలింగప్ప యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

పునర్ వ్యవస్థీకరణ సరికాదు



పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ సరికాదు. ప్రస్తుతం ఆరు రకాలు బడుల విధానం అమల్లో ఉండగా మరో 9 రకాలను బడులను విభజిస్తున్నారు. ప్రభుత్వం తీసుకొన్న ఈ నిర్ణయం వలన విద్యారంగం విచ్ఛిన్నం అవుతుంది. దీంతో పాఠశాలల వ్యవస్థ నిర్వీర్యం అవుతుంది. పునర్ వ్యవస్థీకరణ వలన ఎవరు ఏ పాఠశాలలో ఉంటారో, ఎవరు ఎక్కడికి వెళ్తారో తెలియకుండా ఉపాధ్యాయులను గందరగోళంలోకి నెట్టారు.

– నాగేంద్రప్ప, ఎస్టీయూ జిల్లా అసోసియేటెడ్ ప్రెసిడెంట్

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా డ్రైనేజీ పనులు


గోనెగండ్ల బైపాస్ వద్ద వర్షపు నీటి తొలగింపు పనులు పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ వాసులకు ఇబ్బంది లేకుండా వర్షపు నీరు డ్రైన్‌ల ద్వారా వెళ్లేలా పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని గోనెగండ్ల బైపాస్ రోడ్డులో వర్షపు నీరు వెళ్లేలా చేపట్టిన పనులతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద, ఇందిరా నగర్, పార్క్ రోడ్డు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచినలు చేశారు. పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో టీపీఓ రాజేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్‌కార్డు లింక్ చేసుకోండి

కౌతాళం: ఇంటి పన్నులకు ఆధార్‌కార్డు లింక్ చేసుకోవాలని సర్పంచ్ పాల్‌దినకర్, కార్యదర్శి, ఈఓఆర్‌డీ ప్రకాశం సూచించారు. మంగళవారం కౌతాళం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇంటి పన్నులు, కుళాయి పన్నులు కలిగిన వారు ఆధార్‌కార్డు లింక్ చేసుకోవాలన్నారు. ఇంటి పన్ను రశీదు ఆధార్‌కార్డును పంచాయతీ కార్యాలయానికి తీసుకుని వస్తే లింక్ ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపారు.

రీ సర్వే పకడ్బందీగా నిర్వహించండి


సుంకేశ్వరిలో రీ సర్వేను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

మంత్రాలయం రూరల్ : గ్రామాల్లో రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. మంగళవారం మంత్రాలయం మండంలోని సుంకేశ్వరి గ్రామంలో తహసీల్దార్ ఎస్. రవి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో రీ సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో 2,720 ఎకరాల భూమిలో సర్వే పూర్తి చేశామని, అందులో దాదాపు 1,010 మంది రైతులు ఉన్నారని వివరించారు. రీ సర్వేలో అవకతవకలు లేకుండా పూర్తి చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వేను చేయాలని సూచించారు. రీ సర్వేలో భూ సమస్యలు, విస్తీర్ణం, కొలతలు, సరిహద్దులు రాళ్ల వంటి సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. సర్వే లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం గ్రామంలోని సర్వే నెంబర్లు 295, 296లోని పొలాలకు వెళ్లె రస్తా వివాదంపై రైతులు ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రజావేదికలో అర్జీలు ఇవ్వడంతో క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేపట్టారు. కార్యక్రమంలో డీటీఓఎస్ శ్రీనివాసరాజు, మండల సర్వేయర్ అశోక్, వీఆర్వో ఆనంద్, గ్రామ సర్వేయర్ తిమ్మేష్, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- పెద్దకడబూరు : రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మండల పరిధిలోని రీ సర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నికైన చిన్న తుంబళం గ్రామంలో జరుగుతున్న సర్వే ప్రక్రియను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలుసూచనలిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ గీతాప్రియదర్శిని, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, రీ సర్వే ఉప తహసీల్దార్ లలితకుమారి, ఆర్‌ఐ జెర్మియా సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన కొనుగోళ్లలో జాగ్రత్త


మాట్లాడుతున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ

గోనెగండ్ల : ఖరీఫ్ సీజన్ సాగుకు విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లూజు విత్తనాలు అమ్మే దళారులు మోసం చేసేందుకు సిద్ధంగా ఉన్నందున్న రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లూజు విత్తనాలు కాకుండా ప్యాకెట్లలో ఉన్నవే కొనుగోలు చేస్తే మేలని తెలిపారు. లూజు విత్తనాలు విత్తుకోవడం వలన పంట మధ్యలోనే నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కంపెనీ ప్యాకెట్లు అయితే వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్సు పొందిన డీలర్లు విక్రయిస్తారని, వారి దగ్గర కొనుగోలు చేస్తే బిల్లు ఇస్తారు. ఒకవేళ పంట నష్టం జరిగినా పరిహారం అందుకునే వీలుంటుందన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రసీదును తీసుకోవాలన్నారు. పంట కాలం పూర్తయ్యే వరకు వాటిని భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో లూజు విత్తనాలు విక్రయించడానికి ఎవరైనా వస్తే సమాచారం అందివ్వాలన్నారు.

మారెమ్మవ్వకు ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండల కేంద్రంలోని మారెమ్మవ్వ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు మారెమ్మవ్వకు చలువ బిందెలను ఊరేగింపుగా తీసుకెళ్లి నైవేద్యం సమర్పించారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి


ఆదోనిలో నిరసన ర్యాలీ

ఆదోని రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనాలను అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు వెంకప్ప డిమాండ్ చేశారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మున్సిపల్ పాఠశాల నుంచి భీమాస్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి కొత్త లేబర్ కోడ్‌లను తీసుకురావడంతో కార్మికులకు నష్టం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు లింగన్న, గోపాల్, వెంకన్న, లక్ష్మన్న, తిప్పన్న, కల్లుబావి రాజు, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

- కౌతాళం: నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం వాల్మీకి సర్కిల్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మండల కన్వీనర్ ఈరన్న, సీనియర్ నాయకుడు మల్లయ్యలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల పోరాటం చేసి సాధించుకున్న కార్మిక హక్కులను నిర్వీరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో బడేసా, శంకర్, వీరేష్, హనుమంతు, ఈరన్న, ఆంజనేయ, వలి పాల్గొన్నారు.
- మంత్రాలయం రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షకుల శ్రమను కాలరాసే విధంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐకేఎస్ సంఘాల నాయకులు భాస్కర్ యాదవ్, జయరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రాఘవేంద్ర స్వామి సర్కిల్‌లో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐకేఎస్ సంఘాల నేతృత్వంలో ఆయా సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ..కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, స్కీం వర్కర్స్ అందరిని కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కుబేరు, ప్రాణేష్, వీరేష్, ఆంద్రయ్య, ఎం రాజు, భీమేశ్వరి పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన

కోసిగి : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సీఐటీయూ, రైతుసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కోసిగి వాల్మీకి సర్కిల్‌లో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, రైతు సంఘం నాయకులు వీరేష్, పూజారి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులకై పోరాటం తప్పదు

ఎమ్మిగనూరుటౌన్: కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయక తప్పదని సీఐటీయూ నాయకులు గోవిందు, రాముడు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయకార్యదర్శి గోవర్ధనమ్మ, ఐఎఫ్‌టీయూ నాయకులు అనీఫ్, ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, రాజు, సత్యన్న, ఏసేపు, బతకన్న తదితరులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు వీరేష్, ఉపాధ్యక్షుడు హమాలి వీరేష్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో హెల్త్ సెంటర్ల మూసివేత


మాట్లాడుతున్న విరూపాక్షిరెడ్డి

నందవరం : కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో పల్లెల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను మూసివేసి ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..పల్లెల్లో పేద ప్రజలకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన సత్వర వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారన్నారు. ఈ హెల్త్ సెంటర్ల ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు గ్రామాల్లో నాణ్యమైన సేవలందించాయన్నారు. హెల్త్ క్లినిక్స్‌లో పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలకు వేతనాలు , ఇన్సెంటివ్స్‌ను కూటమి ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో సమ్మె చేస్తున్నారని వివరించారు. ఈ సమ్మె కారణంగా గ్రామాల్లో పేద ప్రజలకు వైద్య సేవలు నిలిచిపోయాయని, రోగాల బారిన పడి విలపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తక్షణమే మల్టీ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల సమస్యలు పరిష్కరించి, వారి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ మండల ఉపాధ్యక్షులు రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున, భీముడు, ఉసేని తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

ఆస్పరి: కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి విరూపాక్షి, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి అన్నారు. మంగళవారం ఆస్పరిలో లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, ఏఐటీయూసీ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాలన్ని రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను రూపొందించిందన్నారు. కార్మికులు ఐక్యమత్యంతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులతో పాటు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అషోషియేషన్ నాయకురాళ్లు రూతమ్మ, మేనక, గుంటమ్మ, నూర్జహన్, ఫాతిమా, రజని, వీరేశమ్మ పాఒల్గొన్నారు.


గోనెగండ్లలో వేరుశనగ విత్తుతున్న దృశ్యం

సాగుకు సన్నద్ధం

గోనెగండ్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందుగానే ప్రారంభమైంది. ఐదురోజుల ఆశించిన మేర వర్షం పాడింది. ఈ వర్షానికి రైతులు భూముల్లో దుక్కులు చేపట్టారు. గోనెగండ్ల మండలంలో తొలి వర్షానికి దుక్కులు చేసుకున్న రైతులు విత్తనాలు విత్తడం మొదలెట్టారు. బోర్లు, బావులు ఉన్న రైతులు, ముందస్తు పొలం పనులు పూర్తి చేసుకున్న వారు తమ పంట పొలాల్లో వేరుశనగ, పత్తి, ఉల్లి, కంది తదితర పంటలు సాగుచేపట్టారు. ఈ ఏడాది వర్షాలు ముందస్తుగా కురుస్తుండడంతో మరింత మంది రైతులు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సారి సాధారణ విస్తీర్ణం కంటే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగవచ్చునని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శివ సినీ కాంప్లెక్స్‌లో మంగళవారం సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఆయన అభిమాన సేవసమితి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అభిమాన సంఘ రాష్ట్ర కన్వీనర్ ముజీబ్, ఎమ్మిగనూరు అధ్యక్షుడు రంగస్వామి చౌదరిలు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం 30 మంది రక్తదానం చేశారు. అదేవిధంగా గుడికల్ గ్రామం, పట్టణంలోని కొండవీటి ప్రాంతానికి చెందిన జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు విజయ్, శ్రీరాములు కుటుంబాలకు రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో సేవా సమితి నాయకులు రఫీక్, ముని, నూర్, అమాన్, హర్షరాజు, మున్నా, రాఘవేంద్ర, విజయ్‌తారక్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగదు.. మురుగు పారదు!


మురుగుకాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీలలో చెత్తాచెదారం పేరుకుపోయింది. కొద్ది రోజులుగా కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించకపోవడంతో మురుగు నీరు ముందుకుపారక నిల్వ ఉంటుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో అనారోగ్యానికి గురవుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ అధికారులకు పది రోజుల నుంచి చెబుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కాలువల్లోని మురుగు నీరు రోడ్డుపై ప్రవహించిందని, రాకపోకలు ఇబ్బందులు పడ్డామని చెబుతున్నారు. అధికారులు స్పందించి కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారంను తొలగించాలని కోరుతున్నారు.

ఉపాధి కూలీలకు కనీస వేతనం అందించాలి

ఆదోని రూరల్: ఉపాధి పనుల్లో పాల్గొనే కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని సీఐటీయూ ఆదోని మండలాధ్యక్షులు జె.రామాంజనేయులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్‌చేశారు. మంగళవారం మండలంలోని పాండవగల్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం నాడు సీపీఎం ఆధ్వర్యంలో దేశంలో ఉన్న అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు కలిసి సమ్మె చేయాల్సి ఉండగా.. తాత్కాలికంగా జూలై 9కి వాయిదా పడిందన్నారు. అనంతరం ఉపాధి కూలీలతో కలిసి చేపట్టే నిరసన కార్యక్రమాల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గోవిందు, అనీఫ్‌బాషా, ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.